ప్రజాశక్తి

బుధవారం 16 జూలై 2025 | 5 | విజయనగరం



## పంటకు ప్రాణం పోసిన వర్షం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎండల తీవ్రతకు వరినారు, మొక్కజొన్న పంట ఎండిపోయే స్థితికి చేరుతున్న సమయంలో వర్షం కురిసి ప్రాణం పోసింది. బొబ్బిలి పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా వర్షాలు లేకపోవడంతో ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వర్షంతో ప్రజలు సేద తీరారు.



మొక్కజొన్న పంట పొలంలో చేరిన వర్షపునీరు

# అద్దె భవనాల్లో వసతిగృహాలు

## ఇరుకు గదుల్లో విద్యార్థుల పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వెనుకబడిన కులాలు విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాటు చేసిన వసతి గహాలు అధ్వానంగా తయారయ్యాయి. ప్రభుత్వ వెనుకబడిన సంక్షేమ వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మించకుండా అద్దె భవనాల్లోనే నెట్టుకొస్తోంది. ఇరుకు గదుల్లో నిర్వహిస్తూ విద్యార్థులతో చెలగాటం ఆడుతోంది. విజయనగరం జిల్లాలో ప్రీ మెట్రిక్ వసతి గృహాలు పేదలు, వెనుకబడిన 39, పోస్ట్ మెట్రిక్ (కాలేజీ) వసతి గృహాలు 15 ఉన్నాయి. విద్యార్థులు కోసం ఏర్పాటు చేసిన బిసి సంక్షేమ వసతి గహాలు స్వంత భవనాల్లో కొన్ని ఉంటే అద్దె భవనాల్లో అధిక సంఖ్యలో వసతి గృహాలు ఉన్నాయి. మొత్తం 54 వసతి గృహాల్లో 3600మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కులాలు కోసం ఏర్పాటు చేసిన ఈ వసతి గృహాలు ఇరుకైన భవనాల్లో ఉండటం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న బిసి బాలురు వసతి గృహం పాత (రాజ్యలక్ష్మి సినిమా హాల్) ఎదురుగా ఉన్నది పాడైన చాలా పురాతనమైన భవనంలో ఉంది. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ వసతి గృహాలోనూ ఉంది. 25 ఏళ్ల కిందట నిర్మించిన వసతి గృహాలు కావడంతో అధ్వాన్నంగా ఉన్నాయి. ఇప్పటికే కస్పా వీధిలో ఉన్న వసతి గృహం మార్చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో ఉన్న ప్రీమెట్రిక్ వసతి గృహాలలో 1600 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాలేజీ వసతి గృహాలలో సరిపడా వసతి లేకపోయినా విద్యార్థులు నెట్టుకొస్తున్నారు. ఈనేపథ్యంలో నగరంలో శాశ్వత వసతి గృహాల నిర్మాణం చేపట్టాల్సిఉంది.



అద్దె భవనంలో ఉన్న బిసి వసతిగృహం



ఊడిపోయిన తలుపులు

### శాశ్వత వసతి గృహాలు నిర్మించాలి

జిల్లాలో బిసి ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి. అద్దె భవనాల్లో ఉన్న వాటికి మౌలిక వసతులు కల్పించి, అదనపు భవనాలు ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు వసతి గృహాల్లో ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

- డి.రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు



తలుపుల్లేని మరుగుదొడ్లు

## డిసిసిబి చైర్మన్లకు లక్నోలో శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన 13 జిల్లా సహకార బ్యాంకుల డిసిసిబి చైర్మన్లకు లక్నోలోని బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో విజయనగరం డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున పాల్గొన్నారు. పాలన సామర్థ్యం పెంపు, నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధి, సహకార రంగంలోని తాజా అభివృద్ధులపై దృష్టి సారిస్తోంది. పాలనా వ్యవస్థలు, బోర్డు మరియు కమిటీల పాత్ర, సమర్థ గవర్నెన్స్ పద్ధతులపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న ప్రతినిధులు లక్నోలోని ప్రముఖ చేపల జన్యుపరిశోధనా సంస్థను సందర్శించారు. చేపల వద్ధి, వ్యాధి నియంత్రణ, దిగువస్థాయి పెట్టుబడులతో మెరుగైన దిగుబడుల సాధన, శాస్త్రీయ పరిశోధనలో సహకార రంగపు భాగస్వామ్యం వంటి అంశాలపై నిపుణులతో చర్చించారు.

### జిల్లా కొనుగోలు కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్ సేతు మాధవన్ జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్లను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులుగా టి. విమలరాణి, జిల్లా మహిళా అభివృద్ధి, సాధికారిత అధికారి ఎంవి కరుణాకర్, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం సూర్యనారాయణ, డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఉమా భారతి, గంట్యాడ, గరివిడి సిడిపిఒలు ఆరుద్ర, ఉమాదేవి, జిల్లా నోడల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

## కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా

### పెన్షన్ వ్యాలిడేషన్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్ వద్ద పెన్షనర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి అప్పారావు, జిఎస్ నారాయణ మాట్లాడుతూ కేంద్రంలో 8వ పే కమిషన్‌ను, రాష్ట్రంలో 12వ పేకమిషన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. డిఎ బకాయిలు తక్షణం చెల్లించాలనీ కోరారు. ఉద్యోగ పెన్షనర్లకు కాంప్రహెన్స్ హెల్త్ ఇన్స్యూరెన్స్ స్కీమును అమలు చేయ్యాన్నారు. కమ్యూటేషన్ రికవరీ కాలం 15ఏళ్ల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం గౌరవాధ్యక్షులు సూర్యనారాయణ, త్రినాధరావు, నాయుడు, పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జెసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని అయాన్ డిజిటల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తనిఖీ చేశారు. ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో లెక్చరర్ పోస్టుల భర్తీకి మంగళవారం నుంచి పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంతో ఈ పరీక్షా కేంద్రాన్ని జెసి తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహిస్తున్న తీరును, చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

అభ్యర్థులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. తనిఖీల్లో విజయనగరం తాహశీల్దార్ కూర్మనాధరావు, సెంటర్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.



అశోక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు బేబినాయన, మురళీమోహన్

## అశోక్‌కు శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి-విజయనగరంకోట

గోవా గవర్నర్‌గా నియమితులైన టిడిపి సీనియర్ నాయకులు, కేంద్రమాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజుకు అభినందనలు వెల్లువెత్తాయి. అశోక్ బంగ్లాలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఇతరులు కలసి మంగళవారం పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, బొబ్బిలి, రాజాం ఎమ్మెల్యేలు బేబినాయన, కోండ్రు మురళి, తోయక జగదీశ్వరి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, టిడిపి నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్, రవిశేఖర్, వనజాక్షి, డెంకాడ మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనాయుడు, తదితరులు అశోక్‌ను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించడటం పట్ల ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిలోనూ ఒక గవర్నర్ పదవి వచ్చినంత ఆనందంగా ఉందన్నారు. తమ 50ఏళ్ల జీవిత చరిత్రలో మచ్చలేని నాయకుడిగా ఎదిగారన్నారు. జిల్లాకు మొదటి కేంద్రమంత్రి గా, గవర్నర్ పదవి వచ్చాయన్నారు. అశోక్‌ను కలసి అభినందనలు తెలిపిన వారిలో సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు, సిబ్బంది, ఎంఆర్ ఫార్మాశి కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది ఉన్నారు.

# రోడ్డును అడ్డంగా తవ్వేశారు

## న్యాయం చేయాలని మహిళల ఆందోళన

ప్రజాశక్తి - చీపురుపల్లి

మూడు రోజుల కిందట జనసేన నాయకులు జగనన్న కాలనీకి వెల్లే రోడ్డుని రెండు చోట్ల తవ్వేశారని దీంతో తాము కూలి పనుల కోసం, ఉపాధి కోసం, తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నా మార్గం లేకుండా పోయిందని జగనన్న కాలనీకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఎవరితో చెప్పుకోవాలో తెలియడం లేదని, గత రెండు రోజుల నుండి పనులకు వెల్ల లేక పస్తులుంటున్నామంటూ రోడ్డు తవ్వేసిన చోటకు వచ్చి నిరశన తెలిపారు. కనీసం అధికారులు కూడా ఇటు వైపు కన్నెత్తి చూడ లేదని తమ ఆవేదనను ఎవరు అర్థం చేసుకుంటారంటూ మంగళవారం అక్కడకు వెల్లిన వైసిపి నాయకులను మహిళలు అడిగారు.

ఇది ఇలా ఉండగా గత ప్రభుత్వంలో చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని గులివిందాడ అగ్రహారం సమీపంలో సుమారు 700 మంది పేదలకు జగనన్న కాలనీ కింద స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేశారు. ఈ క్రమంలో అక్కడ కొంత మంది పేదలు ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల కిందట జనసేనకు చెందిన విసినిగిరి శ్రీనివాసరావు అనే వ్యక్తి రోడ్డుని రెండు చోట్ల జెసిబితో అడ్డంగా తవ్వించేసి కాలనీ వాసులకు రాకపోకలకు అంతరాయం కల్పించాడని కాలనీ వాసులు ఆరోపించారు. గత ముప్పై ఏళ్లుగా కాలనీ రాక ముందు నుండే జి అగ్రహారంనకు చెందిన రైతులకు సంబంధించి కళ్లాలకు వెల్లేందుకు ఇదే మార్గంను వినియోగిస్తున్నామని రైతులంటున్నారు. గత ఐదేళ్ల నుండి ఇక్కడ జగనన్న కాలనీ కట్టి పేదలకు ఇవ్వడంతో చాలా మంది పేద వారు ఇక్కడే నివశిస్తున్నారని రోడ్డుని తవ్వేయడం వల్ల జగనన్న కాలనీలో నివాసముంటున్న ప్రజల రాకపోకలతో పాటు పాఠశాలలకు వెల్లాల్లిన విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహిళలు, ప్రజలు వాపోయారు. దీంతో అక్కడకు చేరుకున్న వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణలు తవ్వేసిన రోడ్డుని తిరిగి జెసిబి పెట్టి పూడ్పించారు. అనంతరం జగనన్న కాలనీ వాసులు, వైసిపి నాయకులు స్థానిక తహశీల్దారు డి దర్మరాజుని కలసి వినతి పత్రాన్ని అందజేశారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

### విసినిగిరి శ్రీనివాసరావే తవ్వించింది

#### జెసిబి యజమాని సువ్వాడ

మూడు రోజుల కిందట రాత్రిపూట రోడ్డుకి అడ్డంగా తవ్వాలని జెసిబి పంపించాలని జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు తనని కోరాడని జెసిబి యజమాని సువ్వాడ అప్పలరాజు తెలిపాడు.



మాట్లాడుతున్న సిజిఎం సులేఖరాణి

## పిఎం సూర్యఘర్ పథకానికి రుణాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రధానమంత్రి సూర్య ఘర్ సోలార్ రూఫ్ టాప్ విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటుకు బ్యాంకు రుణాల కోసం దరఖాస్తు చేసుకొనే వినియోగదారులకు తొందరగా రుణాలను మంజూరు చేయాలని ఎపి ఇపిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సోలార్ బి.సులేఖ రాణి బ్యాంకర్స్‌కు కోరారు. దాసన్నపేట విద్యుత్ భవనంలో మంగళవారం బ్యాంకర్స్, సోలార్ వెండర్స్, ఇపిడిసిఎల్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు కోసం రుణాలతో పాటు విద్యుత్ వినియోగదారులకు అవసరమైన సాంకేతిక పరమైన అంశాలపై కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ టి.రవిని ఈ పథకం అమలుకు విజయనగరం జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం. రమణమూర్తి తెలిపారు. విద్యుత్తుశాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.మురళీకృష్ణ, పి.త్రినాధరావు, జి. సురేష్ బాబు, బి.రఘు తదితరులు పాల్గొన్నారు.

# భవానిని అభినందించిన జెసి

## క్రీడాప్రాధికార సంస్థ తరపున ప్రోత్సాహకం అందజేత



క్రీడాకారిణి భవానిని అభినందిస్తున్న జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కజకిస్టాన్‌లో జరిగిన జూనియర్ ఆసియన్ ఛాంపియన్‌షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వరుసగా 3 బంగారు పతకాలను సాధించిన జిల్లాలోని కొండకరకాం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రెడ్డి భవానీని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అభినందించారు. తమ ఛాంబర్‌లో మంగళవారం ఆమెను దుశ్శాలువతో సత్కరించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తరపున రూ.25వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. వచ్చే ఒలింపిక్ పోటీల్లో పతకాన్ని సాధించి, దేశానికి, జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వర్రావు, కోచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా సత్కరించిన పౌర వేదిక**

**కంటోన్మెంట్** : కొండకరకాం గ్రామంలో అతి సామాన్య కుటుంబంలో జన్మించిన రెడ్డి భవాని ఇటీవల కజికిస్తాన్ లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు బంగారు పతకాలను సాధించి తెలుగురాష్ట్రాలతో పాటుగా దేశ ప్రతిష్టను పెంచిందని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. మంగళవారం జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో భవానిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో అద్భుతమైన వెయిట్ లిఫ్టర్ లు ఉన్నారని, గతంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించి దేశానికి, తెలుగు రాష్ట్రాలకు గొప్ప పేరు తెచ్చారని తెలిపారు. రెడ్డి భవాని తల్లిదండ్రులు సామాన్య వ్యక్తులని, వారికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ఉపాధి కల్పించి భవానీని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి తగిన ఆర్థిక సహాయం చెయ్యాలని భీశెట్టి కోరారు. కార్యక్రమంలో భవానీ కోచ్ ఆనంద్, పౌర వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్ర రాజు, తుమ్మగంటి రాంమోహన్, దవడ కొండబాబు, అల్లంశెట్టి నాగభూషణం, పోలుపర్తి అప్పారావు, తాత్రాజు రాజారావు, జాగరపు ఈశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

## వచ్చే నెల 19న ఐద్వా జిల్లా మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వచ్చేనెల 19న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 9వ జిల్లా మహాసభ విజయనగరంలో జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.పుణ్యవతి, పి. రమణమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా సంఘం ఉపాధ్యక్షులు అర్.కృష్ణవేణి, సహాయ కార్యదర్శి వి.లక్ష్మి తో కలిసి మహాసభ గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ ఐద్వా గత మూడేళ్ల కాలంలో చేసిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకునేందుకు మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 19న కలెక్టర్ కార్యాలయం నుంచి కెఎల్‌పురంలోని ఎన్‌పిఆర్ భవనం వరకు ప్రదర్శన, అనంతరం మహాసభ జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు




నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

## ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.24500 చెల్లించాలని, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలు పదో తేదీ లోపు ఇవ్వాలని, సమ్మె ఒప్పంద జీవోలు, ఖాళీలు భర్తీ చేయాలను కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు మద్దతుగా కార్పొరేషన్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్‌రావు, ఎస్.రాజు, ఎస్.రామునాయుడు, కె.ఆది నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని, ఏడాదైనా నేటికీ జీతాల పెంపుపై స్పష్టమైన ప్రకటన ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నగరపాలక సంస్థ టెండర్లలో థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలు చెల్లించే విధంగా కోడ్ చేయాలని, పదవ తేదీలోపు జీతాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉత్తర నాయుడు, రాంబాబు, గౌరీ, రమేష్ పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణగా శక్తి యాప్

## అదనపు ఎస్‌పి సౌమ్యలత



విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు ఎస్‌పి సౌమ్యలత


ప్రజాశక్తి - కంటోన్మెంట్

మహిళలకు రక్షణకు శక్తి మొబైల్ యాప్ ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్‌చేసుకొని అవసరమైనప్పుడు ఉపయోగించుకోవాలని జిల్లా అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత సూచించారు. మంగళవారం నగరంలోని అపెక్స్ కళాశాలలో విద్యార్థినులకు శక్తియాప్ పట్ల అవగాహన కల్పించారు. మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని, ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్నట్లేనన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్‌లోని ఎస్ఒఎస్. బటన్ ను ప్రెస్ చేసినట్లయితే క్షణాల్లో పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకొని, రక్షణగా నిలుస్తారన్నారు. మహిళల భద్రతకు ఈ యాప్‌లో సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఉందని, మహిళలు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు, ఆటోల్లో ప్రయాణించేటపుడు ఈఆప్షన్ పై క్లిక్ చేసి, చేరుకోవాల్సిన ప్రాంతాన్ని నమోదు చేస్తే, వారు సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకొనేంత వరకు వారి ప్రయాణంపై పోలీసులు నిఘా పెడతారన్నారు. విద్యార్థులు లక్ష్యంపై దష్టి పెట్టుకొని, చదువుకోవాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. చదువుకొనే సమయంలో ఇతరులపట్ల ఆకర్షితులు కావద్దని, వారు చెప్పే మాయమాటలు నమ్మి, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు బానిసలు కావద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి గురించిన సమాచారం ఏదైనా తెలిస్తే డయల్ 100/112 కు లేదా 1972 కు గాని వెంటనే తెలియజేయాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇ.నరసింహమూర్తి, ఎస్ఐ శిరీష, శక్తి బృందం కానిస్టేబుళ్లు, కళాశాల ప్రిన్సిపాల్ నిజాముద్దీన్, ఎఒ పి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల షాపులపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి- సంతకవిటి, వంగర

మండలంలో పొనుగాటివలసలోని శ్రీనివాస ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ సిఐ టి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం దాడులు చేపట్టారు. తనిఖీల్లో 20:20:0:13 ఎరువులు 38 బస్తాలు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక నిల్వలు ఉన్నందున దుకాణానికి 'స్టాప్ సేల్' నోటీస్ జారీ చేశారు. దుకాణం లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, గోదాం లైసెన్సును అధికారులు పరిశీలించారు. తనిఖీల్లో రాజాం ఎఒ ఎం.రామారావు, సంతకవిటి ఎఇఒ గోవిందరావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



సంతకవిటి.. రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సిఐ అప్పలనాయుడు

**వంగర** మండలంలోని అరసాడలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు టి అప్పలనాయుడు, రామారావు సంయుక్తంగా నిర్వహించారు. పత్రాలు సరిగా లేని రూ.4,12,119 విలువగల పురుగుల మందులను గుర్తించి వీటికి ఆయా కంపెనీల నుంచి అనుమతులు వచ్చేంతవరకు అమ్మ కూడదని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఒ కన్నబాబు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

## రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ నెల 13న తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి 5వ గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని గుంపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు పాల్గొని ప్రతిభ చూపించారు. ఆల్తీ గౌతమ్, కింతాడ హర్ష వర్ధన్ గోల్డ్ మెడల్, మైపాడ సంజయ్, పిన్నింటి రంజిత్ కుమార్ సిల్వర్, తాడివాడ హేమని, పతివాడ గిరీష్ కాంస్య పతకాలు సాధించారు. దీంతో వీరంతా ఈ నెల 26న చత్తీష్‌గడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మంగళశారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## డ్రోన్లతో ఓపెన్ డ్రింకింగ్ నియంత్రణ

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జామి పోలీసు స్టేషను పరిధిలోని అలమండ సంత పరిసరాలలో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న వారిని పోలీసులు డ్రోన్స్ సహాయంతో గుర్తించి 9మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై ఆకస్మికంగా దాడులు నిర్వహించేందుకు కొన్ని మాసాలుగా డ్రోన్లను వినియోగిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అలమండ సంత పరిసరాలలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై డ్రోన్స్‌తో నిఘా ఏర్పాటు చేసామన్నారు. డ్రోన్స్ ప్రయోగించి, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న 9మంది వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు.

## ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రహదారులను, కాలువలను ఆనుకుని ఎటువంటి ఆక్రమణలు చేపట్టినా సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రణాళిక విభాగం సిబ్బంది ఈరోజు స్థానిక ఆర్ అండ్ బి జంక్షన్ వద్ద రహదారి మార్జిన్ ఆనుకుని కాలువలపై ఉన్న బడ్డీలు, చిన్న చిన్న దుకాణాలను తొలగించారు.

## కౌమారదశ ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు కౌమారదశ ఆరోగ్యం, శారీరక-మానసిక అభివృద్ధిపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ జి.సన్యాసమ్మ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. కౌమారదశలో యువతులు ఎదుర్కొనే శారీరక, మానసిక, హార్మోన్ల మార్పులపై వివరించారు. సరైన ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డివి రామమూర్తి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ కౌమారదశలో యువత స్వీయగౌరవం, బాధ్యతాభావం పెంపొందించుకోవడం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పూల్ బాగ్ శ్రీ లక్ష్మి గణపతి కాలనీలోగల సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం వద్ద భక్తుల దాహార్తిని తీర్చేందుకు శుద్ధజల ప్లాంట్ ను వ్యవస్థాపక అధ్యక్షులు, సుబ్రహ్మణ్య ఉపాసకులు కర్రి వెంకటరమణ సిద్ధాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాలనుండి వస్తున్న భక్తుల దాహార్తిని దృష్టిలో పెట్టుకుని కీర్తిశేషులు ఇసరపు రామనారాయణ, లక్ష్మి దంపతులు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సౌజన్యంతో శుద్ధజల ప్లాంట్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ అధ్యక్షులు బేతా కృష్ణారావు, కార్యదర్శి ఇసరపు శ్రీనివాస గోపలకృష్ణ, ఉపాధ్యక్షులు అచ్చిరెడ్డి, దువ్వు శ్రీనివాస్,బెహరా కూర్మారావు, దానయ్య, ఆర్చకులు శరవణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వేపాడలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండల కేంద్రంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరవుతున్నారని, మండలంలోని టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సోంపురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను, ముళ్లపొదలను తొలగించారు. కాలువల్లో పూడికలను జెసిబి సహాయంతో తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.గంగరాజు, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు పాల్గొన్నారు.

## పాఠశాల సందర్శన

వేపాడ మండలంలోని ఆకులసీతంపేట పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు మంగళవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థి మిత్ర కిట్లు, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి, తెలుగు, ఇంగ్లీషు పదాలు చదివించి, అంకెలు రాయించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## పాఠశాలకు సామగ్రి వితరణ

మండలంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాలకు శ్రీ సీతారామ యువజన సేవా సంఘం సీలింగ్ ఫ్యాన్, డైరీలు, క్రేయాన్స్, పెన్సిల్ బాక్సులను మంగళవారం అందజేసింది. సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 26 పోలింగ్ కేంద్రాల విభజన

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గంలో 1200 మంది ఓటర్లు దాటిన 26 పోలింగ్ కేంద్రాలను విభజించనున్నట్లు పి.రామ్మోహనరావు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆర్‌డిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే చెప్పాలని కోరారు. అధికంగా ఓటర్లు 26 కేంద్రాలను విభజించి, కొత్తగా మరో 26 కేంద్రాలను ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి, వైసిపి నాయకులు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ సబ్‌స్టేషన్ పరిధి రామతీర్థం రూరల్ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11కెవి సబ్ స్టేషన్ క్షపరిధిలో 11కెవి రామతీర్థం రూరల్ ఫీడర్ వ్యవసాయ పనులు కొనసాగింపు, కొమ్మలు తొలగింపు, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, బొడ్డపేట, వల్లూరు, మధుపాడ గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

## వన్‌టౌన్ సిఐగా చౌదరి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం వన్‌టౌన్ సిఐగా చౌదరి బాధ్యతలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చౌదరి స్పెషల్ బ్రాంచ్‌లో రెండో సిఐగా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సిఐ శ్రీనివాసరావును విఆర్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

### మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి- మెంటాడ

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం మండలంలోని కొండలింగాల వలస, జయితి గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ప్రజల సమస్యలను, అవసరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్పందిస్తూ సాధ్యమైనంతవరకు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అది కేవలం టిడిపి ప్రభుత్వం వల్లే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గెద్ద అన్నవరం, మెంటాడ పిఎసిఎస్ అధ్యక్షులు గొర్లె ముసలినాయుడు, పూడి చంద్రునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కొండలింగాలవలసలో మంత్రి సంధ్యారాణికి హారతిస్తున్న మహిళ

### వర్షంలోనూ ఎమ్మెల్యే 'తొలి అడుగు'

**విజయనగరంకోట** : వర్షాన్ని సైతం లెక్కచేయకుండా స్థానిక విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ద్వారపూడి గ్రామంలో సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సుపరిపాలన కార్యక్రమాలను వివరించారు. ఏడాది కాలంలో టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అంతకుముందు నగరంలోని 48, 49, 50వ డివిజన్లలో సుపరి పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు, పట్టణ కార్యదర్శి బంగారు బాబు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, సర్పంచ్ ఎ.ఆదిలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ వెన్ను శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

### ముంజేరులో సుపరిపాలనలో తొలి అడుగు

**డెంకాడ :** భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామంలో మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ పెళ్లకురి శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసి పిడుగు వెంకటసత్యం, క్లస్టర్ ఇంచార్జ్ పిడుగు తోటరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు పాలపర్తి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ కానూరి రామకృష్ణ, బూత్ ఇంచార్జి దారపురెడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.

**గుర్ల:** సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టిడిపి ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి అన్నారు. మండలంలోని పాలవలసలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వల్లూరు బంగారు నాయుడు, గేదెల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ సుంకరి పైడినాయుడు, వల్లూరి పైడితల్లి నాయుడు, పొట్నూరు అప్పలనాయుడు, సుంకరి రమణ తదితరులు పాల్గొన్నారు.

## గరిమెళ్ల కవితా సంకలనం ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట



కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌డిసి సవరమ్మ, రచయితలు

జాతీయ కవి గరిమెళ్ళ సత్యనారాయణ జయంతి సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురజాడ కేంద్ర గ్రంథాల యంలో మంగళ వారం యువత కోసం కవితా స్రవంతిలో భాగంగా రచయిత రత్నాల బాలకృష్ణ సంపాదకత్వం వహించి, అరసం ప్రచురించిన గరిమెళ్ళ సత్యనారాయణ కవితలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. సవరమ్మ ఆవిష్కరించారు. గరిమెళ్ళ మాకొద్దీ తెల్ల దొరతనం అంటూ బ్రిటిష్ వారితో పోరాడిన సాహితీ యోధుడని కొనియాడారు. జీవిత చరమాంకంలో అత్యంత దయనీయమైన జీవితం గడిపిన గరిమెళ్లకు తెలుగు ప్రజలందరూ రుణపడి ఉంటారని పేర్కొన్నారు. జిఎస్ చలం సంపాదకత్వం వహించిన 'జాతీయాలు-సామెతలు' పుస్తకాన్ని అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ ఆవిష్కరించారు. తెలుగు భాష ప్రజలకు దూరమవుతున్న తరుణంలో మన మౌఖిక సాహిత్యాన్ని పదిల పరుచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, అందుకోసం పుస్తకం వెలువరించడం ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమానికి జివి ఎస్ జయపాల్ రావు ఆహ్వానం పలుకగా, ఎస్.శ్రీనివాసరావు, బద్రి కూర్మారావు పుస్తక సమీక్ష చేశారు.

## బంగారు కుటుంబాల ఎంపికపై సభలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న సిబ్బంది

బంగారు కుటుంబాల తుది జాబితా ఎంపిక ప్రక్రియలో భాగంగా అన్ని సచివాలయాలు పరిధిలో సభలు జరిగాయి. బంగారు కుటుం బాల అర్హతలను, అనార్హతలను వెల్లడి చేస్తూ సభలు నిర్వహించారు. అలాగే ఇంకా మిగిలి ఉన్న అర్హులైన బంగారు కుటుంబాల నిరుపేదలను గుర్తించే ప్రక్రియలను చేపట్టారు. ఈసందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా, స్వర్ణ ఆంధ్ర 2047 విజన్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం పి 4 విధానాన్ని రూపొందించిందని పేర్కొన్నారు. బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు నేటి నుండి వార్డు సభలను నిర్వహిస్తున్నా మన్నారు. బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పునః పరిశీలన చేసి, మార్పులు చేర్పులతో తుది జాబితాను తయారు చేయనున్నట్లు తెలిపారు.

## అవనాపు జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశకి-విజయనగరం టౌన్

విజయనగరం మున్సిపల్ మాజీ చైర్మన్ అవనాపు సూరిబాబు 75వ జయంతి సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలుచేపట్టారు. నిర్వహించిన కంటి వైద్య శిబిరం 476 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వీరిలో 142 మందికి ఆపరేషన్లు చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. అవనాపు సూరిబాబు జయంతి సందర్భంగా విజయనగరం నాగవంశ సంక్షేమ సంఘం, స్వామి కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షులు అవునాపు విక్రమ్ ప్రారంభించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మంచు రవళి నేతృత్వంలో స్వామి కంటి ఆసుపత్రి సిబ్బంది రోగులకు సేవలు అందించారు. తొలుత అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరీ శంకర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ మంచు రవళి, నాగవంశ సంక్షేమ సంఘ ప్రతినిధులు, అభిమానులు, సూరిబాబు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ సమాజంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. మున్సిపల్ ఆఫీసు వద్దనున్న అన్నా క్యాంటీన్ లో పేదలకు మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా అందించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.



సూరిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అవనాపు విక్రమ్, కాళ్ల గౌరీశంకర్ తదితరులు




## కార్తికేయ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇద్దరు విద్యార్థుల కొట్లాటలో మృతి చెందిన కార్తికేయ కుటుంబానికి న్యాయం చేయాలని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సాంబయ్య, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. కార్తికేయ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, ఆర్‌ఐ రాంకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అభ్యుదయ పాఠశాల యాజమాన్యం పర్యవేక్షణా లోపంతోనే కొట్లాట జరిగి కార్తికేయ మృతి చెందాడని వారంతా ఆరోపించారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఎమ్మెల్యే బేబినాయన.. అభ్యుదయ పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించడంతో రూ.5 లక్షలు పరిహారం ఇచ్చేందుకు ముందుకొచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. ఆస్పత్రిలో విద్యార్థి మృతదేహాన్ని డిఎస్‌పి భవ్యరెడ్డి పరిశీలించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## డాక్టర్ రాజేష్‌వర్మకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానిక పిహెచ్‌సిలో సుదీర్ఘకాలంగా ప్రజలకు నిబద్ధతతో సేవలందించిన వైద్యధికారి డాక్టర్ రాజేష్ వర్మతో పాటు బదిలీపై వెళ్లిన ఆరోగ్య సిబ్బందికి మంగళవారం పిహెచ్‌సి ఆవరణంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. వైద్యులు డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ ప్రమీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ రాజేష్ వర్మ తో పాటు ఆరోగ్య సిబ్బందిని సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ రాజేష్ వర్మ తమ విధిలో ఎంతో నిబద్ధతతో, పేషెంట్లపై మానవతా దృక్పథంతో సేవలందించారని కొనియాడారు. మానవసేవే మాధవ సేవ అని మానవీయ కోణంలో సేవలు అందిస్తూ పిహెచ్‌సికి మంచి గుర్తింపు తీసుకురావడంలో ఆయన పాత్రను ప్రశంసించారు. డాక్టర్ రాజేష్ వర్మ మాట్లాడుతూ ఇక్కడ పని చేయడం తన జీవితంలో ఒక అరుదైన అవకాశం అన్నారు. సిబ్బంది సహకారం వల్లనే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలలో అవార్డులు అందుకునే గౌరవం దక్కిందన్నారు. తాను సింహాచలం పిహెచ్‌సికి బదిలీపై వెళ్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ఉమాపతి, ఆర్‌వి రమణ, బంగారుబాబు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామీణ బ్యాంకు ద్వారా బీమా

ప్రజాశక్తి-రామభద్రపురం

ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు ఖాతాదారులకు ప్రధానమంత్రి జన సురక్ష బీమా ప్రయోజనాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఆరికతోట బ్రాంచ్ మేనేజర్ శ్రీనుబాబు తెలిపారు. మంగళవారం పాతరేగలో దీనిపై అవగాహన కల్పించారు. అతి తక్కువ వార్షిక ప్రీమియంతో సహజ, ప్రమాదవశాత్తూ మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల్లో ప్రతీ ఖాతాదారుడు చేరాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ, సర్పంచ్ గొట్టాపు రాజు పాల్గొన్నారు.


## అనాథ వృద్ధుడిని ఆదుకున్న ఎఎస్‌ఐ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

అనాథ వృద్ధుడిని 14 నెలలుగా నీడ కల్పించి, అన్నీ తానై చూసుకుంటూ మానవత్వం చాటుకుంటున్నారు.. బొండపల్లి ఎఎస్‌ఐ గోపినాథ్. గజపతినగరం మండలం మరుపల్లి సమీపంలోని టేకు తోటలో మానాపురపు శ్రీనివాసరావును గుర్తుతెలియని వ్యక్తులు తీసుకొచ్చి వదిలేశారు. కదల్లేని స్థితిలో ఉన్న ఆయన గురించి తెలుసుకున్న ఎఎస్‌ఐ గోపినాథ్ చలించిపోయారు. గత 14 నెలలుగా తన ఇంటి నుంచి భోజనం తీసుకువచ్చి పెట్టడమే కాకుండా సపర్యాలు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. అనాథ వృద్ధుడికి అన్నీ తానై ఆదరించడంతో గోపినాథ్‌ను తోటి సిబ్బందితోపాటు, పలువురు నాయకులు, సేవా సంఘాలు సభ్యులు అభినందించారు.

## బీమాతో రైతులకు ధీమా

ప్రజాశక్తి-వేపాడ



రైతులతో మాట్లాడుతున్న ఎడి భానులత

పంట ల బీమాతో రైతులకు ధీమా లభిస్తుందని వ్యవసాయ శాఖ ఎడి భానులత తెలిపారు. మంగళ వారం మండలం లోని బొద్దాం, పాటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారుమడిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఎద వరిసాగులో కలుపు యాజమాన్యం గురించి తెలిపారు. వరి పంటకు ఎకరాకు రూ.200 చొప్పున ప్రీమియం చెల్లిస్తే బీమా వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఒ స్వాతి, సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

## జనసేన మండల అధ్యక్షుడిపై దాడి

ప్రజాశక్తి- నెల్లిమర్ల



గాయపడిన అచ్చుంనాయుడు

నెల్లిమర్ల జనసేన మండల అధ్యక్షులు పతివాడ అచ్చుంనాయుడుపై వైసిపి నాయకులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన ఆస్పత్రిలో చేరారు. మొయిద పంచాయతీ పరిధిలోని నారాయణపట్నంలో ఈ దాడి జరిగినట్లు తెలిసింది. అచ్చుంనాయుడు పార్టీలో కీలకంగా ఉండటంతో ఓర్వలేని ఆ గ్రామానికి చెందిన కొంత మంది వైసిపి నాయకులు ఆయనపై దాడి చేసి గాయపర్చినట్లు బాధితుడు ఆరోపించారు. అయితే పొలంలో గొడవ జరిగిందని, దానికి రాజకీయం అంటగడుతున్నారని వైసిపి నాయకులు చెబుతున్నారు. కాగా ఈ గ్రామం ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పంచాయతీలో ఉండటంతో చర్చ నీయాంశమైంది.

## ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి చర్యలు

### ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి, తెర్లాం మండలాల రైతులకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో మంగళవారం ఎమ్మెల్యే బేబినాయనను ఎపిఎస్‌ఐడిసి ఇఇ త్రిమూర్తులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. రాముడువలస, లోచర్ల ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. నిధులు మంజూరయ్యేలా చూస్తానని అధికారులకు తెలిపారు.

**గ్రంథాలయానికి సొంత నిధులతో సీలింగ్**

శాఖా గ్రంథాలయానికి సొంత నిధులతో సీలింగ్ వేస్తానని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. పైకప్పు రేకు వేడికి గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పైవిధంగా ఆయన స్పందించారు. బోరు పాడైపోవడంతో నీటి కోసం, మరుగు దొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పగా, ఆయా సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సత్య కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్

## కరాటేలో సత్య కళాశాల విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కోచ్ సంతోష్ ఆధ్వర్యంలో కరాటే లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇటీవల విశాఖపట్నం జిల్లా లో జరిగిన అంతర్ రాష్ట్ర కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో బాలబాలికలు విజయం సాధించారు. కాటా, కుముటీలో పతకాలు సాధించారు. కె.స్నేహ, పి.హేమంత్, ఎల్.జస్వంత్, కె.శివ గణేష్, పి.వెంకటరమణ, కె.మోహన్‌చంద్ర, కె.ప్రేమేష్, ఎన్. జనని, వి. ఇంద్ర, ఎం.సాత్విక్, రజిత, బి. లెవాన్, జి.వివేక్ వర్మ బంగారు, రజిత పతకాలు సాధించారు. వీరిలో బంగారు పతకాలు పొందిన విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సత్య కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయిదేవ మణి, ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్, కోచ్ కె.సంతోష్ కుమార్, అసిస్టెంట్ కోచ్ సుధీర్ భార్గవ్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా యూత్ స్కిల్స్ డే

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒకేషన్ విభాగం ఆధ్వర్యాన యూత్ స్కిల్స్ డేను నిర్వహించారు. 2015 నుంచి ప్రభుత్వం నిర్వహిస్తున్న యూత్ స్కిల్స్ డే ప్రాముఖ్యతను హెచ్‌ఎం వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆర్ట్, డ్రాయింగ్, క్విజ్, వన్ యాక్ట్ ప్లే, స్కిల్స్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు వెంకటరమణ, దినేష్, షేక్ హసీనా పాల్గొన్నారు.

## మోసానికి కేరాఫ్ చంద్రబాబు

ప్రజాశక్తి- డెంకాడ

మోసానికి కేరాఫ్ అడ్రాస్‌గా చంద్రబాబు పేరు చొప్పవచ్చునని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. మండలంలోని చొల్లంగిపేట, డి.కొల్లాం, గుణుపూర్ పేట, గుణుపూర్, డెంకాడ, సింగవరం, నాతవలస గ్రామాలలో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పిన్నింటి తమ్మినాయుడు, నాయకులు బడ్డుకొండ చిన్న, బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, కరుమజ్జి త్రినాధ్, లెంక లక్ష్మణరావు, పతివాడ కృష్ణ వేణి, రేగాన శ్రీనివాస్‌రావు, సర్పంచ్‌లు, ఎమ్‌పిటిసిలు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి అందజేత


ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

భోగాపురం మండలంలోని ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం బాధితులకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి సిఎం సహాయ నిధి చెక్కులను అందించారు. పాండ్రంకి సత్యవతికి రూ.76,154, గవిడి దామయంతికి రూ.45,318 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆశాజ్యోతి లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేకుండా చూడాలి

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సంయుక్త వ్యవసాయ సంచాలకులు విటి రామారావును కలిసి ఆయన కోరారు. ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని పేద రైతులు ప్రయివేట్ దుకాణలకు వెళ్లకుండా చూడాలని, ప్రభుత్వమే రైతులకు సులభ పద్ధతిలో ఎరువులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు వల్లూరు గణేష్, మండల అధ్యక్షులు గట్టి భాను, పిఎసిఎస్ చైర్మన్ చెలికాని మహేష్, రవీంద్ర, గట్టి రఘు, సమతం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న తాలూకా కార్యవర్గం

## పిఆర్ మినిస్టీరియల్ యూనియన్ ఎన్నిక

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ మంగళవారం సాయంత్రం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన గజపతినగరం తాలూకా ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కర్రోతు రాజ్ కుమార్ (సీనియర్ అసిస్టెంట్) పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా జి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎస్ రాజశేఖర్, కార్యదర్శిగా ఎంవిఆర్ సన్యాసిరావు, సహాయ కార్యదర్శిగా పిఎస్వి ప్రసాదరావు , కోశాధికారిగా ఆర్ నవీన్ కుమార్ ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు అధికారిగా కర్రోతు రాజకుమార్, పరిశీలికునిగా రవికుమార్ వ్యవహరించారు. నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి రాజ్ కుమార్ ప్రమాణం చేయించారు